
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





# - 186 -

# అమెరికాకర కాయ – కలగూర గంప కథ

**ఈ కాకర కాయ ఉంది** చూశారూ...పైకి అమాయకంగా కనపడినా, అది ఎంతో గడుసుది సుమా అని ఈ ఏడాది మా తోటలో ఆ పాదు చేస్తున్న స్వైర విహారం చూస్తే అర్థం అవుతుంది. అంత కంటే ముందు గత ఏప్రిల్ లో నాకూ, మా క్వీన్ విక్టోరియా కీ ఉస్కో అంటే ఉస్కో అనుకుంటూ దెబ్బలాడేసుకోడానికి కూడా ఈ అమెరికాకర కాయే కారణం. ముందుగా పాదులు పాకుటకు పందిళ్ళు ఎన్ని వెయ్యాలి, ఎలా వెయ్యాలి, ఎక్కడ వెయ్యాలీ మొదలైన ఇంజనీరింగ్ డిజైన్ నాది, అవి వేసే కష్టం ఫెర్నాండెజ్ ది, మా ఇద్దరి మీదా అజమాయిషీ మా క్వీన్ విక్టోరియాదీ అనమాట.... ఇక్కడ భాషాదోషం వలన మా ఫెర్నాండెజ్ కి రెండు కష్టాలు...అనగా వాడికి తెలుగు ఎంత వచ్చో ఈవిడకి స్పానిష్ అంతే వచ్చును కాబట్టి ఆది మానవుల టైపులో చేతులు ఊపుకుంటూ, కుయ్యో, మొర్రో లాంటి అరుపులతో ఆవిడ వాడికి ఎక్కడ తను కాకర, కీకర పాదులు వేయునో, ఎక్కడ వంగ, గోంగూర వేయదల్చుకుందో చెప్పడం, వాడు ఏదో అర్థం అయినట్టు తల ఊపడం, ఆ తతంగం చూస్తూ గట్టిగా నవ్వితే ఆ ఇద్దరూ నన్ను ఇంకా గట్టిగా కలిసి తంతారేమో అని ముసి ముసి నవ్వులు నవ్వుకోడం ఒక రకం కష్టం. రెండోది పాపం వాడు నిజంగానే మట్టి మనిషి కాబట్టి ఆ పందిళ్ళు వేసి, కూర మొక్కలకి మళ్ళు సిద్ధం చేసి, మట్టి పోసి, అందులో అమెరికా ఆవు పేడ కలిపి, గడ్డి పెరగకుండా ఆపడానికి ఆ దిక్కుమాలిన పైన్ బార్క్ మల్చ్ కూడా వెయ్యడానికి రెండు వేల డాలర్ల కాయకష్టం పడడం మరొక కష్టం కానీ కష్టే ఫలే అన్నారు కదా. ఇక్కడ కష్టం ఫెర్నాండెజ్ ది. కాకర కాయ క్వీన్ విక్టోరియాదీ.

ఇంతకీ మా ఇద్దరికీ అసలు దెబ్బలాట కాకర పాదు ఎక్కడ వెయ్యాలీ అనే ప్రగాఢమైన విషయం మీదే!. వెయ్యవలసిన పాదుల్లో ఆనప, బీర, పొట్ల పెద్ద ఆకులతో విస్తారం గా పాకి పెద్ద సైజులో కాపు కాసే టైపు. చిక్కుడు కాయ గుత్తులు చిన్నవే కానీ పాదు పొలోమని ఊరంతా పాకి పారేస్తుంది. దొండ దొంగ..అంతా కళాకళలు. ఒక ఏడు అది మగ దొండ...అస్సలు కాపు కాయనే కాయదు. మరొక సారి మొత్తం అంతా పాకి పారేసి రోజుకి పాతిక పైగా దొండ కాయలు

కాసి పారేసే ఆడ దొండ. అంచేత దీన్ని కాస్త దూరంగా విడిగా వేద్దాం అనుకున్నాం. ఇక దోస కాస్త నాజూకు ది. సొగసు గా పాకుతూ మిగతా సహ పాదుల వారిని ఇబ్బంది పెట్టకుండా మధ్యలోనే సద్దుకుని తన కాపు తను కాసుకుంటూ





పోతుంది. అంచేత దోస పాదుని కూడా విడిగానే వేద్దాం అనుకున్నాం. బూడిద గుమ్మడి, తియ్య గుమ్మడి, పుచ్చకాయ లాంటివి మన తోటలో వేశాం అంటే అంతే సంగతులు. వాటి ధాటికి మిగతావి అన్నీ చచ్చి ఊరుకుంటాయి. ఇండియాలాగా ఇంటి పెంకుల మీదకి ఎక్కించడానికి బైడెనూ, ట్రంపూ ఒప్పుకోరు. జైలుకి పోతాం. అంచేత అవి మా స్నేహితులకి వెధవ కబుర్లు చెప్పి, నమ్మించేసి వాళ్ళ తోటలో వేయించేసే ఏర్పాటు చేశాను. పాపం చెప్పుకుంటే పోతుంది

అంటారు కదా...మనది అలాంటి కేసే! ఇక మిగిలినది అల్లా కాకర పాదు. కాకర పాదు కూడా చిన్న ఆకులతో సొగసు గా ఉంటుంది, ఎక్కువ ఉధృతంగా పాకి పారెయ్యదు అంటుంది మా క్వీన్ విక్టోరియా. 'అలా మోస పోకు. కాకర ని నమ్మకు. సరిగ్గా చూడు. అది మోసగత్తె. పైన అన్నీ ముళ్ళు లా ఉంటూంది కానీ గుచ్చు కోవు. ఆకు పచ్చగా, ముచ్చటగా ఉంది కదా అని తరిగి వేయిస్తే అంతా చేదు. పులుసు లో వేస్తే బెల్లం వెయ్యక పోతే అది కషాయం లా ఉంటుంది. కాకర పాదు చాప కింద నీరు లాగా మొత్తం అంతా పాకి మిగతా పాదుల ప్రాణాలకి ముప్పు రావచ్చు' అని నా హెచ్చరిక. మొత్తానికి మా ఇద్దరికీ రాజీ కుదిర్చి ఫెర్నాండెజ్ చెప్పినట్టుగా బుద్ధిగా ఒక దాని పక్కన ఒకటి చొప్పున అన్ని పాదుల విత్తనాలూ గత ఏప్రిల్ లో వేశేశాం. అప్పటి నుంచీ రోజూ వెళ్ళి అవి మొలిచాయా లేదా అనీ, ఆ తర్వాత మూడో ఆకు వేసిందా లేదా అనీ చూడడం మొదలు పెట్టాను. పాటలు వింటే బాగా మొక్కలు బాగా పెరుగుతాయి అని ఎక్కడో చదివి ఒక సారి కెవ్వు కేక పాట పెట్టగానే అప్పుడే మొలిచిన డజను మొక్కలు ఠకీమని చచ్చి పోయాయి. దాంతో నేను స్ట్రేటజీ మార్చి 'ఊ అంటావా, ఊ ఊ అంటావా'' లాంటి పాటలు పెట్టి మూడు నెలలు సేవ చేస్తే అన్ని పాదులూ విలాసంగా నేల మీదే అటూ ఇటూ పాకడం మొదలెట్టడం మొదలు పెట్టాయి. ఇక నేను మెల్లగా, మెత్త గా వాటిని సాకుతూ 'అమ్మా, ఆనపా. ఒసేయ్ బీరా, ఏమోయ్ పొట్లా, చిక్కుడు పాపా, మీరు పందిళ్ళ మీదనే పాకాలమ్మా, ఇలా ఎక్కడపడితే అక్కడ కాదు' అని వాటిని బతిమాలుకుని ఏది ఏ పాదు అని తెలిసేలా మూడు నెలల పాటు నా తంటాలు పడ్డాక అవి ఎక్కడ పాకితే నాకెందుకూ అని చేతులు ఎత్తేశాను. ఎందుకంటే అడ్డాల నాడు బిడ్డలే కాని మీసాల నాడు కాదు కదా!. అందులోనూ ఈ కాకర పాదు అభిమన్యుడి లా విజృంభించేసి, భీష్మాచార్యుల వంటి ఆనప పాదు, ద్రోణాచార్యుల లాంటి బీర, కృపాచార్యుల లాంటి పొట్ల, దుర్యోధనుడిలా పౌరుషంగా పాకి పారేసే చిక్కుడు...ఇలా అన్నింటినీ ఈ కాకర పాదు

ఢీకొని, ఓడించి తన వశం చేసుకుంది. 'ఎందెందు చూసిన అందందే కలదు కాకర పాదు" అన్నట్టు దాని మధ్యలో ఆనప ఎక్కడుందా, బీర ఎక్కడుందా అని వెతుక్కోవాల్సిన పరిస్థితి నుంచి తప్పించుకుని పోటీ పడింది ఒక్క చిక్కుడు మాత్రమే.

ఇక ఒక వేపు వేసిన పాదుల్లో కాకర పాదు విశ్వరూపం చూపిస్తే, మరొక చోట వేసిన దోస, వంగ, టొమేటో, బెండ, మిరప మొదలైన వాటిని నిర్దాక్షిణ్యంగా అణగి తొక్కేసినది దొండ పాదు. ఈ సారి దొండ కాండలు మూడు నాలుగు రకాలు పాతడం తో వాటి పాకడం, కాపు కాయడం కూడా విస్తారంగానే ఉంది. వాటి కాపుని బట్టి దొండ కాయలు శాండో దొండ, తమన్నా దొండ అని రెండు రకాలుగా ఉంటాయి అని తెలిసిపోయింది. ఇందులో శాండో దొండ బండగా, బలంగా, గుండ్రంగా, వస్తాదులా ఉంటుంది. తమన్నా దొండ నాజూగ్గా, పొడుగ్గా నవ నవలాడుతూ సొగసు గా ఉంటుంది. పైగా శాండొ దొండ కాయలు మోసగాడికి మోసగాళ్ళే. చూడ్డానికి ఒక్కలాగా బొండాం లో ఉన్న దొండ కాయ కోస్తే ఒకటేమో పచ్చగ, పచ్చిగా ఉంటుంది. మరొకటి ఎర్రగా పండిపోయి వృద్ధాప్యం మీద పడినట్టు ఉంటుంది. అదే తమన్నా ని చక్రాలు గానో, నిట్టనిలువునానో చీలిస్తే కోస్తే భలే నాజూగ్గా ఉంటుంది.



మా తోటలో ఈ మధ్య నేను కోసుకొచ్చిన కూరగాయల సాంపుల్ ఫొటో ఇక్కడ పెట్టాను. ఇది చూసి అంతా బాగానే ఉంది కదా అనుకుంటారేమో కానీ...మొదట్లో నాకు మా చిన్నప్పుడు సైన్సు మేష్టారు చెప్పిన పరాగ సంపర్కం, పర పరాగ సంపర్కం పాఠం గుర్తుకు వచ్చింది. గుర్తుకు రావడం ఏమిటీ,,,ప్రత్యక్షంగా అనుభవం లోకి వచ్చి మళ్ళీ నాకూ, మా క్వీన్ విక్టోరియాకీ కీచులాడుకోవడానికి కారణం అయింది. ఎందుకంటే మొదట ఒక రోజున తోటలో రాజులా ఆ పాదుల్లో హాయిగా విహరించి, ఆ పచ్చ దనాన్ని ఆస్వాదించి, ఒక బుట్టలో కూరలు కోసుకొచ్చి మా వంటింట్లో కౌంటర్ మీద పెట్టి "ప్రేయసీ, ఇదిగో చూడు, ఈ వంకాయలు ఎంత నాజూకుగా ఉన్నాయో, ఈ కాకర కాయలకి పైన ముళ్ళు లేనే లేవు.."అని నన్ను నేనే మెచ్చుకుంటూ ఉండగా ఆవిడ ఆయా కూరల కేసీ, నాకేసి తీక్షణం గా చూసి బహుశా అనాలోచితంగానే "నీ మైండ్ ఏమైనా దొబ్బిందా" అని సినీ భాషలో అనేసి నాలిక్కరుచుకుంది. నేను ఆ మైండ్ అనే పదార్థం సాధారణంగా ఉండే బుర్ర గోక్కుని, అది ఎక్కడికీ దొబ్బ లేదు నిక్షేపంగా అక్కడే ఉంది అని నిర్ధారించుకుని ఆవిడకి ఆ తప్పుడు అభిప్రాయం కలగడానికీ, ఆ కూరలకీ ఉన్న సంబంధం ఏమిటి, ఊర్వశీ అని అడిగాను.

ఆవిడ వెంటనే "మొగుడూ, అవి కాకర కాయలు కాదు కీకర కాయలు. నువ్వు వంకాయలు అంటున్నవి సంకర వంగాయలు. ఎక్కడో వర్ణ సంకరం జరిగి ఆనప కాయ కాకర సైజులోనూ, చిక్కుడు పొట్ల లాగా, వంగ దొండ కాయ

లాగా, దొండకాయ గుత్తివంకాయ లాగా తగలడినట్టున్నాయి." అని తన ప్రగాఢమైన అభిప్రాయం వెలిబుచ్చింది. పోనీ అలాగే పరాగ, పర పరాగ సంపర్క సిద్దాంతాల ప్రకారం కాకర మరియు ఆనప సంపర్కించుకుని కొత్త రకం సొరకాకర కాయలూ, అలాగే దోస, వంగ, దొండ, బెండ లు కలిసి 'వందొందోబెం' అనే రకం మా తోటలో పండాయి అనుకుందాం, దానికీ నా మైండ్ ఎక్కడికో పోవడానికీ లంకె పట్టడం మా క్వీన్ విక్టోరియాకి తగునా?

మొత్తానికి ఈ ఏడు మా తోటలో కూరగాయల ధర్మమా అని రెండు సరదా పనులు దొరికాయి. ఒకటేమో ఆ పాదుల్లోకీ, కూరగాయల మళ్ళ లోకీ వెళ్ళి అలా చేతులతో తడిమేసి ఎక్కడ, ఎలాంటి కూర గాయ చేతికి తగిలినా అది దొండా, వంగా, కాకరా, ఆనపా, బీరా అని వెధవ ఆలోచనలు, తర్జన భర్జనలూ మానేసి కోసుకొచ్చి ఇంట్లో పడెయ్యడం మొదటి సరదా. ఇక మా క్వీన్ విక్టోరియా వాటిని ఏ కూరల కేటగిరీ లో వేసి వేపుడు, ఉడక బెట్టుడు, పులుసు, పచ్చడి, పెరుగు పచ్చడి వగైరాలలో వండి ఏ పేరు పెట్టునా అని కుతూహలం గా ఎదురు చూడడం రెందో సరదా!. వీటన్నింటి మధ్యలో ఎటువంటి కాయా కాయకుండా భోరు మని బావురుమంటున్న తోటకూర, గోంగూర, బచ్చలి, మెంతి కూరలని కోసి విడదీయడం అన్నింటికన్నా పెద్ద పరీక్ష. ఏమంటారు?

**COMMENTS**